సాక్షి కామారెడ్డి
సోమవారం। 6। జనవరి। 2025



**నత్తనడకన నిర్మాణం**
గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నట్లుగా సాగుతున్నాయి.
- 9లో ▸



**హమాలీల అరెస్ట్**
డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీలను పోలీసులు అరెస్టు చేశారు.
- 9లో ▸

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం
29.7 /8.3
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి. మంచు దట్టంగా కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### రిమాండ్‌లో నలుగురు టీచర్లు

నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గంలోని ఓ ప్రభుత్వ విద్యాలయంలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన నలుగురు ఉపాధ్యాయులపై వారం క్రితం పోక్సో కేసు నమోదయ్యింది. వారిని మూడు రోజుల క్రితం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

### మంత్రి జూపల్లి సభా స్థలి పరిశీలన



బాన్సువాడ : బాన్సువాడలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొనే సభా స్థలాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. బాన్సువాడలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ శాఖ కార్యాలయం ప్రారంభోత్సవం, అమృత్ 2.0 పథకానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే సభకు మంత్రి హాజరు కానున్నారు. సభ స్థలాన్ని పరిశీలించిన వారిలో కాంగ్రెస్ నాయకులు నార్ల సురేష్ తదితరులు ఉన్నారు.

### నాయక్‌పోడ్‌ల సమస్యలు పరిష్కరించాలి



నిజాంసాగర్(జుక్కల్): ఆదివాసి నాయక్‌పోడ్‌లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం రాత్రి హైదరాబాద్‌లో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్‌ను ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం జిల్లా నాయకులు కలిశారు. నాయక్‌పోడ్ కులస్తులను కులధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, ఎంప్లాయ్‌మెంట్‌తోపాటు పైచదువుల కోసం అవసరమైన సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా కోరారు. పోడు భూముల కేటాయింపులో జరుగుతున్న అన్యాయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న, గాండ్ల రాంచందర్, హైకోర్టు అడ్వొకేట్ పి.కిషన్, తదితరులున్నారు.

# యువతపై రక్తపోటు!

- మధుమేహ బాధితులూ అధికమే..
- టాప్ ఫైవ్ జిల్లాల్లో కామారెడ్డి
- నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో వెల్లడి



**జిల్లాలో బీపీ, షుగర్ బాధితులు** పెరుగుతున్నారు.. మారుతున్న జీవనశైలి, ఆహారపుఅలవాట్లతో యువతలోనూ ఈ రోగాలు ఎక్కువగా వస్తున్నాయి. ఇటీవల వెలువడిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే రిపోర్టు ప్రకారం జిల్లాలో పరీక్షించిన వారిలో 96శాతం మంది షుగర్‌తో, 71 శాతం బీపీ సమస్యతో ఉన్నట్లు తేలింది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రక్తపోటు, మధుమేహం రోగుల సంఖ్య జిల్లాలో భారీగా పెరుగుతున్నట్లు తాజా సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయి. 30 ఏళ్ల పైబడిన వారి జనాభా జిల్లాలో 4,86,463 మంది ఉండగా 13 శాతం మందిని పరీక్షించి సర్వే చేశారు. 63,240 మందికి మధుమేహం (షుగర్) పరీక్షలు నిర్వహించగా 60,444 మందికి షుగర్ ఉన్నట్లు తేలింది. అంటే 96 శాతం మందికి నిర్ధారణ అయ్యింది. అలాగే 1,26,480 మందికి రక్తపోటు(బీపీ) పరీక్షలు నిర్వహించగా 90,317 మందికి బీపీ ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. సర్వే చేసిన వారిలో 71 శాతం మంది బీపీ సమస్యతో ఉన్నట్లు తేలింది. గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు మధ్య ఈ సర్వే చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ముప్పై ఏళ్లు, ఆపైబడిన టార్గెట్ జనాభాకు సంబంధించి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)–5 మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా అంశాల్లో నిర్దేశిత జనాభా శాతానికి అనుగుణంగా అధ్యయనం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 46 శాతం మంది షుగర్‌తో, 44 శాతం మంది బీపీతో బాధపడుతున్నట్లు తేలగా మన జిల్లాలో గణంకాలు మాత్రం ఆందోళనకరంగా ఉన్నాయి. సర్వే ప్రకారం బీపీ, షుగర్‌తో బాధ పడుతున్న వారిలో జిల్లా రాష్ట్రంలో టాప్ ఐదులో ఉంది.

### ఇలా తగ్గించుకోవచ్చు..

- అధిక బీపీతో బాధ పడుతున్న వారు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.
- చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెందొద్దు. యోగా, ధ్యానం చేయాలి.
- షుగర్‌తో బాధపడుతున్న వారు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోవాలి. పిండి పదార్థాలు తక్కువగా తినాలి.
- బీపీ, షుగర్‌తో బాధ పడుతున్న వారు రోజూ వ్యాయామం చేయడంతో పాటు, సరిగా నిద్ర పోవాలి.

### కారణాలు ఎన్నో..

శారీరక శ్రమ తగ్గిపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పులు, అనేక రకాలైన మానసిక ఒత్తిళ్ల రక్తపోటు, మధుమేహం పెరగడానికి కారణమవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో నవ యువకులు సైతం గుండెపోటుతో మరణిస్తుండడానికి ఇవే కారణాలుగా స్పష్టమవుతోంది. ప్రధానంగా 30 ఏళ్ల పైబడిన వారిలో చాలా మంది ఒత్తిళ్లతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మద్యపానం, రకరకాల జంక్ ఫుడ్స్ తీసుకోవడం వంటి కారణాలు కూడా బీపీ, షుగర్లకు కారణమవుతున్నాయి.

- ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, మద్యపానం, ధూమపానం బీపీ పెరగడానికి కారణాలు. మూత పిండాల పనితీరు దెబ్బతిన్నా బీపీ వస్తుంది. దీంతో పాటు టీ, కాఫీ, కూల్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకుంటే శరీరంలో టాక్సిన్లు పెరిగి రక్తనాళాలు మందంగా మారి బీపీ వస్తుంది.
- టైప్‌– 1 మధుమేహం చాలా మందికి పుట్టుకతోనే వస్తుంది. ఈ రకం షుగర్ సోకిన వారిలో ఇన్సులిన్ తక్కువగా ఉత్పత్తి అవుతంది. బాధితులు ఇన్సులిన్ తీసుకోవాలి.
- టైప్‌– 2 మధుమేహం సాధారణంగా మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లతో వస్తుంది.

### రోజూ వ్యాయామం చేయాలి



ఈ మధ్య కాలంలో 30–35 ఏళ్ల వయసు వారిలో మధుమేహం, రక్తపోటు ఎక్కువగా కనిపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా కూర్చున్న చోటు నుంచే అన్ని పనులు చేయడం, జంక్ ఫుడ్ తినడం, ఒత్తిడి మూలంగా రక్తపోటు, మధుమేహం సమస్యలు వస్తున్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రతిరోజు ఉదయం చేతులు ఊపుతు కనీసం అర గంట నడవాలి. ఉప్పు, నూనెలు, కొవ్వు పదార్థాలు తక్కువగా తినాలి. పీచ పదార్థాలు, కూరగాయలు, ఆకుకూరలు తినాలి. – శరత్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్య కళాశాల, కామారెడ్డి

# నిధులు వెనక్కి!

- పోచారం ఉపకాలువల మరమ్మతులకు నిధుల కేటాయింపు
- పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వెనక్కి వెళ్లిన వైనం



సైడ్‌వాల్స్ నిర్మించాల్సిన డి-44 కాలువ

నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్ట్ ఉపకాలువల మరమ్మతులకు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. నిజాం కాలంలో నిర్మించిన పోచారం ప్రధాన కాలువకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అనంతరం కాలువ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రస్తుతం పోచారం ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువలు అధ్వానంగా మారాయి. బుంగలు పూడ్చకపోవడం, సైడ్‌వాల్స్ నిర్మించకపోవడంతో సాగునీరు వృథాగా పోతుంది. వీటి మరమ్మతులకు గతంలోనే నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ కింద నిధులు సైతం మంజూరయ్యాయి. కానీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టలు ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. బిల్లులు సకాలంలో రావేమోననే భయంతోనే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టలెవరూ ముందుకు రావడం లేదని నీటిపారుదలశాఖలోని ఓ అధికారి తెలిపారు.

**వెనక్కిపోయిన నిధుల వివరాలు**

- పోచారం ప్రధాన కాలువకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ–10ఏ శిథిలావస్థకు చేరింది. దీని మరమ్మతులకు 2022లోనే రూ.2.09లక్షలు మంజూరు అయ్యాయి. ఈ పనుల కోసం అధికారులు మూడుసార్లు టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఈ నిధులు తిరిగి వెళ్లిపోయాయి.
- డిస్ట్రిబ్యూటరీ– 38ఏ బ్యారెల్ చెడిపోయింది. దీనికి మరమ్మతులు చేపట్టేందుకు 2023లో రూ.7.6 లక్షలు మంజూరు అయ్యాయి.
- డి–44కు సైడ్‌వాల్స్ నిర్మాణం చేపట్టేందుకు 2023లో రూ.6.50లక్షలు మంజూరయ్యాయి.
- పోచారం ప్రధాన కాలువ గేట్ల వద్ద సిబ్బంది కోసం గదిని నిర్మించేందుకు 2021లో రూ.4.50 లక్షలు మంజూరయ్యాయి.
- నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూర్ శివారులో గల ప్రధాన కాలువపై ఉన్న ఇరుకు వంతెనకు మరమ్మతులు చేపట్టేందుకు 2021లో రూ.2.09 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

### ఎవరూ ముందుకు రావడం లేదు

పోచారం ప్రధాన కాలువకు సంబంధించిన కొన్ని డిస్ట్రిబ్యూటరీలకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. మరికొన్ని డిస్ట్రిబ్యూటరీల కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో సాగు నీరు చివరి ఆయకట్టుకు అందించడం కష్టమవతుంది. కాలువలకు మరమ్మతులు చేపట్టేందుకు గతంలోనే నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.
– వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ, ఎల్లారెడ్డి



మరమ్మతులు చేపట్టాల్సిన ఆత్మకూర్ సమీపంలోని ఇరుకు వంతెన

# సైబర్ మోసానికి యువకుడి బలి



ఆత్మహత్య చేసుకున్న కమ్మరి గంగరాజు

లింగంపేట: సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిలాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి గంగరాజు(28) కుటుంబం కొంత కాలంగా లింగంపేటలో నివాసం ఉంటోంది. తండ్రితో కలిసి మండలకేంద్రంలో వడ్రంగి వృత్తి చేసుకుంటున్నాడు. ఆయనకు ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. బెంగళూరునుంచి మాట్లాడుతున్నామని, ఇంటి నిర్మాణం కోసం లోన్ ఇస్తామని, ప్రాసెసింగ్‌కు కొంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని అవతలి వ్యక్తి నమ్మించాడు. దీంతో గంగరాజు విడతల వారీగా రూ. 52,500 వరకు ఆన్‌లైన్‌లో పంపించాడు. ఎంతకీ రుణం మంజూరు కాకపోవడంతో తాను ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిన వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించగా తనకేం తెలియదని బుకాయించాడు. దీంతో మోసపోయానని గుర్తించిన గంగరాజు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. శుక్రవారం కూతురు ఆధార్‌కార్డు గురించి భార్య పుట్టింటికి వెళ్లింది. అదే రోజు ఇంట్లోనుంచి బయటికి వెళ్లిన గంగరాజు తిరిగి రాలేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం లింగంపేట ఊర చెరువు తూము వద్ద గంగరాజు చెప్పులు కనిపించాయి. దీంతో పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలించగా గంగరాజు మృతదేహం లభించింది. చనిపోవడానికి ముందు గంగరాజు తన చావుకు వాడే(లోన్ ఇప్పిస్తానన్న ఫోన్‌లో నమ్మించిన వ్యక్తి) కారణమని వాట్సాప్ గ్రూపులలో మెస్సేజ్‌లు పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సోని, కూతురు నవ్యశ్రీ, తల్లిదండ్రులు అనసూయ, దర్శన్ ఉన్నారు.

# నిరుపయోగంగా రైతు బజార్

- రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



గాంధీ గంజ్‌లో వృథాగా ఉన్న రైతు బజార్



సుభాష్‌రోడ్డులో కూరగాయల విక్రయాలు



భారత్ రోడ్డులో..

కామారెడ్డి టౌన్ : రైతులు కూరగాయాలు విక్రయించేందుకు జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో నాలుగేళ్ల క్రితం రైతు బజార్ నిర్మించారు. ఇందులో 50కి పైగా దుకాణాలున్నాయి. రూ. 50 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. దీంతో రోడ్లపైనే కూరగాయల విక్రయాలు సాగుతున్నాయి. రైతుబజార్ ఉన్నా రైతులు రద్దీగా ఉండే రోడ్లపైనే కూరగాయలను అమ్ముకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే చాలు చుట్టు పక్కన గ్రామాల నుంచి రైతులు, చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి పట్టణంలోని సుభాష్‌రోడ్, మాయాబజార్, భారత్‌రోడ్‌లలో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తుంటారు. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. అధికారులు స్పందించి గాంధీ గంజ్‌లోని రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఇరుకుగా సర్వీసు రోడ్డు!

- నర్సన్నపల్లి వంతెన వద్ద సింగిల్ రోడ్డు
- జిల్లా కేంద్రానికి వచ్చే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- రద్దీ ఎక్కువ ఉంటుందని తెలిసినా నిర్లక్ష్యం



నర్సన్నపల్లి వద్ద ఇరుకుగా ఉన్న సర్వీస్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జాతీయ రహదారి 44 బైపాస్ రోడ్డుపై నర్సన్నపల్లి చౌరస్తా వద్ద వంతెన నిర్మించిన అధికారులు సర్వీసు రోడ్డును మాత్రం ఇరుకుగా మార్చారు. దీంతో హైదరాబాద్ వైపు నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే నుంచి కామారెడ్డి పట్టణానికి వచ్చే మార్గం సింగిల్ రోడ్డుతో సరిపెట్టారు. నిత్యం వేలాది వాహనాలు కామారెడ్డి పట్టణానికి వస్తుంటాయి. ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు, లారీలు పట్టణానికి వచ్చేందుకు సర్వీసు రోడ్డుపైకి రావడంతో వెనక వచ్చే వాహనదారులు ఓవర్‌టేక్ చేసే పరిస్థితి లేకుండాపోయింది. రూ.కోట్లు ఖర్చు చేసి వంతెనలు నిర్మించి సర్వీసు రోడ్డును ఎందుకు డబుల్ రోడ్డు చేయలేదో అధికారులకే తెలియాలి. సర్వీసు రోడ్డుమీద ఏదైనా ప్రమాదం జరిగినా, వాహనం చెడిపోయినా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది. డబుల్ రోడ్డుగా మార్చేందుకు హైవే అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.






# ‘పంచాయతీ’పై నజర్!

**యువతరంలో రాజకీయాలపై ఆసక్తి పెరుగుతోంది.** పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలలో పోటీ చేయడానికి పలువురు ఉత్సాహం చూపుతున్నారు. సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. శుభాశుభ కార్యాలకు హాజరవుతూ జనం దృష్టిలో పడేందుకు నానా పాట్లు పడుతున్నారు.

- రాజకీయాలపై ఆసక్తి చూపుతున్న యువత
- వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు
- సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి..



### ఫ్లెక్సీలతో హల్‌చల్

ఎన్నికలే లక్ష్యంగా ఆశావహులు పావులు కదుపుతున్నారు. ఇప్పటి నుంచే జనంలో ఉండడం ద్వారా ఎన్నికల్లో సత్తా చాటాలని ఆరాటపడుతున్నారు. పండుగల సందర్భంగా గ్రామంలో ప్రజలకు శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలు కడుతున్నారు. సందర్భానికి తగినట్లుగా రోడ్ల వెంట రకరకాల ఫ్లెక్సీలు తయారు చేయించి అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

భిక్కనూరు : పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి సుమారు ఏడాది కావస్తోంది. ఎన్నికలు ఎప్పుడు వస్తాయన్న అంశంపై ఇప్పటికీ స్పష్టత లేకపోయినా.. సర్పంచ్‌లుగా పోటీ చేయాలని పలువురు ఆసక్తి చూపుతున్నారు. చాలా గ్రామాలలో రాజకీయ చైతన్యం ఉన్నవారు ముందస్తుగానే ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఆరేడు నెలలుగా సేవా కార్యక్రమాలతో జనంలో ఉంటున్నారు. వినాయక చవితి ఉత్సవాల సమయంలో యువజన సంఘాలు, కుల సంఘాలకు వినాయక విగ్రహాల కొని ఇవ్వడానికి పోటీ పడ్డారు. దుర్గా నవరాత్రుల సమయంలోనూ పలువురు అమ్మవారి విగ్రహాల కొనుగోలుకు, మండపాలకు చందాలు ఇచ్చారు. గ్రామాలలో ఎవరైనా చనిపోతే చాలు అక్కడికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించడం, అంత్యక్రియల్లో పాల్గొనడం ద్వారా వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన వారు చనిపోతే ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఫంక్షన్లు, పెళ్లిళ్లకు తప్పనిసరిగా హాజరవుతున్నారు.

**భిక్కనూరులో..**

మండల కేంద్రమైన భిక్కనూరు మేజర్ పంచాయతీలో సర్పంచ్ పదవి మీద పలువురు కన్నేశారు. సర్పంచ్‌గా పోటీ చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఎన్నికల బరిలో తాముంటామనే సిగ్నల్స్ ఇస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన న్యాయవాది రాజబాబు గౌడ్ భిక్కనూరు గ్రామస్తుల కోసం వైకుంఠ రథాన్ని తయారు చేయించారు. ఆయన పండుగల సమయంలో అందరినీ కలుస్తున్నారు. శుభాశుభ కార్యాలకు వెళ్తున్నారు. గ్రామానికి చెందిన ఆర్‌టీఏ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ అనే యువకుడు ప్రజల సమస్యలపై స్పందిస్తున్నాడు. అధికారుల వద్దకు సమస్యలు తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ సర్పంచ్ తునికి వేణు మరోసారి పోటీ చేసే ఉద్దేశంతో ఎల్లప్పుడూ జనం మధ్యే ఉంటున్నారు. మొన్నటి వరకు ఉపసర్పంచ్‌గా కొనసాగిన బోడ నరేశ్ కూడా సర్పంచ్‌గా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. న్యాయవాది బల్ల శ్రీనివాస్ కూడా గ్రామంలో అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. యువకులకు తోడుగా గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు బల్యాల రేఖ, తాటిపాముల పద్మ, బండి చంద్రకళ, ద్యావర లక్ష్మి, దాబా సలీం, బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పర రమేశ్, కాంగ్రెస్ నాయకుడు గజ్జె సురేశ్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు బోండ్ల సునీల్ తదితరులూ ఎన్నికలపై దృష్టి సారించారు. నేతలు ముందస్తుగా సందడి చేస్తుండటంపై ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

**రిజర్వేషన్ ఖరారు కోసం ఎదురుచూపులు**

పంచాయతీ ఎన్నికలలో పోటీ చేయాలని ఆసక్తితో ఉన్నవారంతా ఎన్నికల షెడ్యూల్‌తోపాటు రిజర్వేషన్ల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్నందున తమకు రిజర్వేషన్ అనుకూలంగా వస్తుందన్న ఆశతో చాలా మంది ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు.

### మంచు దుప్పటి



మద్నూర్ వద్ద జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు

**జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో** చలి తీవ్రత పెరిగింది. పొగమంచు దట్టంగా కురుస్తోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణుకుతున్నారు. – మద్నూర్



మద్నూర్ శివారులో దట్టంగా పొగమంచు

## క్లుప్తంగా

### చెక్‌డ్యాంలో భారీ చేప



వేల్పూర్: వేల్పూర్ చెక్‌డ్యాంలో ఆదివారం సుమారు 15 కిలోల బరువున్న భారీ చేప ఓ జాలరికి చిక్కింది. పెద్దవాగులోని చెక్‌డ్యాంలో వేల్పూర్ గంగపుత్రులు నిత్యం చేపలు పడుతుంటారు. ఎప్పటిలాగే చేపల వేటకు వెళ్లిన బండి కిషన్ అనే జాలరికి ఆదివారం భారీ చేప చిక్కడంతో ఆనందం వ్యక్తం చేశాడు. చెక్‌డ్యాంలో ఇంత భారీ చేప లభించడం ఇదే మొదటిసారి అని అతడు పేర్కొన్నారు.

### అర్చరీ పోటీల్లో దోమకొండ క్రీడాకారుడి ప్రతిభ



దోమకొండ: జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో దోమకొండకు చెందిన క్రీడాకారుడు ప్రతిభ చూపి పతకం సాధించినట్లు కోచ్ ప్రతాప్ దాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన అనుదీప్ సిల్వర్ పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. క్రీడాకారుడిని అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కామినేని అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరెడ్డి, తదితరులు అభినందించారు.

### మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట



కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. అథ్లెటిక్స్‌లోని వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు లభించాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజిత్‌మోహన్, డి.నరేష్‌లు తెలిపారు. ఎ.నవీన్‌రెడ్డి, ఎ.సతీష్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌లు బంగారు పతకాలు పొందగా జి.సునీల్‌రెడ్డి, ఓ.దినేష్‌లు వెండి పతకాలు, ఎండీ.అతీకుల్లా, డి.నరేందర్, ఎ.హరీష్‌లు కాంస్య పతకాలు పొందినట్లు, ప్రతిభ చూపిన క్రీడాకారులను అసోసియేషన్ తరపున అభినందించినట్లు వారు పేర్కొన్నారు.

# సమస్యలు పరిష్కరించే వరకు తగ్గేదేలే

- మాట ఇచ్చి పదేళ్లు అధికారంలో ఉండి పట్టించుకోని కేసీఆర్
- మాట మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- సమ్మెను బలహీన పర్చే పనిలో అధికారులు
- అయినా వెనక్కి తగ్గమంటున్న సమగ్రశిక్ష ఉద్యోగులు
- 30 రోజులకు చేరిన సమ్మె



నిజామాబాద్‌లో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆర్మూర్/లింగంపేట్: తమ సమస్యలను పరిష్కరించే వరకు తగ్గేదేలేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసినా, అధికారులు వేధింపులకు పాల్పడుతున్నా వెనక్కి తగ్గమంటూ తేల్చిచెబుతున్నారు. ఈక్రమంలో వారు 30రోజులుగా సమ్మెను నిర్వహిస్తునే ఉన్నారు. నిత్యం వినూత్న రీతిల్లో నిరసనలు తెలుపుతునే ఉన్నారు.

**హామీలిచ్చి.. మాటమార్చి..**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు అన్న పదమే ఉండదు. విద్యా శాఖలో కాంట్రాక్టుపై పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తాం అంటూ గతంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మాటిచ్చాడు. కానీ పదేళ్లు అధికారంలో ఉండి పట్టించుకోలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ జీవోను సైతం అందజేస్తామని 2023లో ప్రతిపక్షనేత హోదాలో రేవంత్‌రెడ్డి మాటిచ్చాడు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీ నెరవేర్చలేదని వారు పేర్కొంటున్నారు. ఇటీవల పర్మినెంట్ చేయలేమని తేల్చిచెప్పడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతుగా వారి వెంటే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీలు గుప్పించిన ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి మొఖం చాటేసారని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. అంతటితో ఆగకుండా ఉన్నతాధికారులు కేజీబీవీల్లో ఇన్‌చార్జి ఎస్‌వోలుగా, మండల విద్యా వనరుల కేంద్రాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. అలాగే కొందరు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాలతో తమకు సంబంధం లేదంటూ ఇన్‌చార్జిలుగా బాధ్యతలు స్వీకరించడమే కాకుండా పలు కేజీబీవీల్లో అదనపు ఆదాయం కోసం ఎంక్వైరీలు చేయడం వివాదాస్పదంగా మారింది. సమ్మె విరమించని పక్షంలో ఉద్యోగాల నుంచి టర్మినేట్ చేస్తామంటూ అధికారుల బెదిరింపులు సైతం ప్రారంభమైనట్లు పేర్కొంటున్నారు.

**మరింత ఉధృతంగా..**

పాలకులు, ప్రతిక్ష నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల మాటలను నమ్మి మోసపోతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి బెదిరింపులకు సైతం భయపడకుండా 30 రోజులుగా నిర్వహిస్తున్న తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామంటున్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయలేని పరిస్థితి ఉంటే పదేళ్ల క్రితం నుంచి సుప్రీంకోర్టు పలుసార్లు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించే వరకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తమకు పే స్కేల్ ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు తగ్గేదే లే.. అంటూ సమ్మెను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

**డిమాండ్లు ఇవీ..**

- సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని వసతులు కల్పించాలి.
- పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పిటిఐ)లకు తక్షణమే 12 నెలల జీతం అమలుకు జీవో విడుదల చేయాలి.
- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.

### సుప్రీం ఆదేశాలు పాటించాలి



సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి కాంట్రాక్టు ఉద్యోగులందరికీ పేస్కేల్ ఇవ్వాలి. సమగ్రశిక్ష ఉద్యోగులకు సైతం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు కాబట్టి తమకు సంబంధం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకోవడం సరైంది కాదు.

– రాజు, జిల్లా అధ్యక్షుడు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, నిజామాబాద్

### రెగ్యులరైజ్ చేయాలి



మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేసారు. ఈ ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేసి మమ్మల్ని సైతం విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలి.

– గంగామణి, జిల్లా అధ్యక్షురాలు, సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగుల సంఘం, నిజామాబాద్

### ఆందోళనలు కొనసాగిస్తాం



ప్రభుత్వ పథకాలు అమలుపర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాము. గత 15 సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం పే స్కేలు అమలు చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలి. అంతవరకు ఆందోళనలు కొనసాగిస్తాము.

– సత్యనారాయణ, సమగ్ర శిక్ష జిల్లా జేఏసీ అధ్యక్షుడు, కామారెడ్డి

### మా సేవలను గుర్తించాలి



గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం అక్షరాస్యత సాధించడానికి కృషి చేయడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇందుకోసం బడిబయట పిల్లలను బడిలో చేర్పిస్తున్నాం. ఇందుకోసం పిల్లల తల్లి దండ్రులకు అవగాహన సైతం కల్పిస్తున్నాం. మా సేవలను ప్రభుత్వం గుర్తించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలి.

– దామోదర్, సమగ్ర శిక్ష జిల్లా నాయకుడు, కామారెడ్డి

### విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులకు సహకారం అందిస్తున్నాము. కేజీబీవీల్లో నాణ్యమైన విద్యను బోధిస్తూ 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాము. బాలికల విద్యాభివృద్ధికి పాటుపడుతున్నాం. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన తమను ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– వాసంతి, సమగ్ర శిక్ష జేఏసీ మహిళా అధ్యక్షురాలు, కామారెడ్డి

## సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



సన్మానం పొందిన మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్: సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆదివారం బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు లేకుండ పోయిందన్నారు. సీఎం బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా ప్రకటించారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యతోనే ఏదైన సాధించవచ్చని నమ్మిన గొప్ప శక్తి సావిత్రిబాయి పూలే అని గుర్తు చేశారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులాల్లో పుట్టినందుకు మనం గర్వపడాలన్నారు. మేయర్ నీతూకిరణ్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, డీఈవో అశోక్, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, గోపాలకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రత్నాకర్, సుధాకర్, రవీందర్, రవికుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన బాలబాలికలు

నిజామాబాద్ నాగారం: మహారాష్ట్రలో ప్రారంభమైన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. 68వ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయ సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలబాలికల విభాగాల్లో పోటీలు జరుగుతుండగా రాష్ట్ర జట్టులో జిల్లా క్రీడాకారులు ఉన్నట్లు, కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, సొప్పరి వినోద్, ప్రశాంత్ కుమార్, అంజలి వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో నిత్యశ్రీ (జెడ్పీహెచ్‌ఎస్ తొర్లికొండ), అశ్విని (జెడ్పీహెచ్‌ఎస్ ముచ్కూర్), సాత్విక, శ్రావిక (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, సుద్దపల్లి) ఎంపికయ్యారు. అలాగే బాలుర విభాగంలో నిఖిల్ చంద్ర (నారాయణ హైస్కూల్ ఆర్మూర్), సిద్దార్థ (సత్యశోధక్ పాఠశాల సిరికొండ), లక్ష్యేందర్ కుమార్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బోధన్), ప్రణయ్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ఉప్పల్‌వాయి) ఉన్నారు.

## జిల్లా సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో రెండో స్థానం



పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా స్థాయి పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పిట్లం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీకాంత్ రెడ్డి రెండో స్థానాన్ని సాధించి ఫోరం బాధ్యుల చేతుల మీదుగా మెమోంటో, మెరిట్ సర్టిఫికేట్ అందుకున్నారు. శ్రీకాంత్ రెడ్డిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

## కిష్కిందకాండకు రేకులతో చెక్



అన్నారంలో పెంకుటిల్లుపై ఏర్పాటు చేసిన ఇనుప రేకులు

రామారెడ్డి: కోతుల గుంపు గ్రామాల మీద పడి ఇళ్లు పీకి పందిరేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉండే పెంకుటిళ్ల కూన పెంకులను పగలగొడుతున్నాయి. కోతుల బెడద మండల వ్యాప్తంగా విపరీతంగా ఉంది. కూన పెంకులతో ఉన్న ఇళ్లను పాడు చేస్తుండటంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. మళ్లీ పెంకులను సర్దడానికి రూ. 20 నుంచి రూ.30 వేలు ఖర్చు అవుతోంది.

**ఇళ్లకు రేకులు వేయించుకుంటున్న ప్రజలు**

కోతుల బెడద తట్టుకోలేక చాలా గ్రామాలలో ఇళ్లపైన రేకులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఇనుప రేకుల ఫిట్టింగ్‌కు ఫీట్‌కు క్వాలిటీని బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు తీసుకుంటున్నారు. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల ఖర్చు పెడితే మమూలు ఇళ్లపై రేకుల ఫిట్టింగ్ పూర్తవుతుందని ప్రజలు చెబుతున్నారు. రేకుల ఫిట్టింగ్ చేసిన ఇళ్లపై కోతులు ఎక్కినా ఎలాంటి నష్టం కలగకపోవడంతో చాలా గ్రామాల ప్రజలు వీటి వైపు ఆసక్తి చూపిస్తున్నారు.

# అపూర్వ సమ్మేళనం



రాణాకలాన్ జెడ్పీహెచ్‌ఎస్ 1985-86 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిన్నమల్లారెడ్డిలో చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ 2002-03 బ్యాచ్ విద్యార్థులు

ధర్పల్లి/ఎడపల్లి/కామారెడ్డి అర్బన్/నిజామాబాద్ అర్బన్: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం వివిధ పాఠశాలల పూర్వ విద్యార్థులు 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' కార్యాక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. ధర్పల్లి మండలంలోని మైలారం జెడ్పీహెచ్‌ఎస్‌లో 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆ త్మీయ సమ్మేళనం నిర్వహించి, ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాటి తీపిగుర్తులు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆప్యాయతంగా పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే ఎడపల్లి మండలం రాణాకాలన్ జెడ్పీహెచ్‌ఎస్‌లోనూ 1985–86 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో 2002–03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నగరంలో దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001–02 పదో తరగతి విద్యార్థులు, అలాగే రావూజీ వంజరి సంఘం ఉన్నత పాఠశాల 1995–96 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహించారు. రావూజీ వంజరి సంఘం విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి భగవద్గీత గ్రంథాన్ని బహుమతిగా అందజేశారు.



మైలారం జెడ్పీహెచ్‌ఎస్ 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



దుబ్బ జెడ్పీహెచ్‌ఎస్ 2001-02 బ్యాచ్ విద్యార్థులు



నగరంలోని రావూజీ వంజరి సంఘం ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థులు

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రుద్రూర్: కోటగిరి మండలంలోని దేవునిగుట్ట తండా శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరి మండలంలోని నాగేంద్రపురం గ్రామానికి చెందిన గైని పవన్ (22)అనే యువకుడు పొలంలో మందు పిచికారి చేయడానికి ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలు దేరాడు. దేవునిగుట్ట తండా శివారులో అతడు ఎదురుగా వస్తున్న కోళ్ల ఆటోను ఢీకొట్టాడు. ఈఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి అంబులెన్స్‌లో బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

రెంజల్(బోధన్): రెంజల్ శివారులో గల పీఏసీఎస్ గోదాం వెనుక భాగంలో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకొని, అరెస్టు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి నుంచి రూ.9400 నగదుతో పాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



## ఆధ్యాత్మికం

### వైభవంగా గోదాదేవి కల్యాణం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో ఆదివారం మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో గోదాదేవి, రంగ్‌నాథ్‌ల కల్యాణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం శ్రీ గోదారంగ్‌నాథ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మార్వాడీలను గోదారంగనాథ్‌ల మాదిరిగా పెళ్లి పట్టు వస్త్రాలు వేసి అలంకరించారు. మార్వాడీ మహిళలు, యువతులు, వ్యాపారులు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భజన చేస్తూ ఊరేగింపు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మార్వాడీ మహిళలు రాజస్తానీ సంప్రదాయ నృత్యం చేశారు.

### గోదాదేవి ఆలయంలో శ్రీనారాయణ మహాయజ్ఞం



కామారెడ్డి అర్బన్: ధనుర్మాసం సందర్భంగా స్థానిక శ్రీనివాస్‌నగర్ కాలనీలోని శ్రీగోదా రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకులు, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం సాంప్రదాయ కార్యదర్శి కృష్ణానందస్వామి శ్రీలక్ష్మీనారాయణ మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చాత్తద శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు గుమ్మల రవి, అహోబిలం శ్రీనివాస్, టి.రాంమోహన్, శ్రీనివాస్, రఘు, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. ఇస్సానగర్‌కు చెందిన నందంగౌడ్, విజయలక్ష్మి దంపతులు రూ.5వేలు, నిజామాబాద్‌కు చెందిన అమృత రావు, అంబిక దంపతులు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అర్చకులు శ్రీనివాసాచార్యులు, సంజీవచార్యులు స్వామి చిత్రపటాలను బహూకరించారు.

### మత్తడిపోచమ్మ ఆలయ అభివృద్ధికి..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం విరాళాలు సేకరించినట్లు గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా లింగంపేటకు చెంది బేడ బుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో రూ.10,016 ఆలయ కమిటీకి అందజేశారు. నారాగౌడ్, బాలయ్య, రాజు, నాగేష్, కిష్టయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు ఇస్కాన్ గురువు రాఘవ స్వామి రాక



కామారెడ్డి టౌన్: ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్న ఇస్కాన్ గురువులు భక్తి రాఘవ స్వామి మహారాజ్ నేడు కామారెడ్డి జిల్లా కేంద్రానికి రానునట్లు కామారెడ్డి ఇస్కాన్ టెంపుల్ ఇన్‌చార్జి వెంకట్‌దాస్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టెంపుల్‌లో ఆయన మాట్లాడారు. రామారెడ్డి రోడ్డులోని ఇస్కాన్ టెంపుల్‌లో నేటి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు ఆయన అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. ప్రతినిధులు హరి దాస్, సవ్యసాచిదాస్ తదితరులున్నారు.

### మహాత్మా..మన్నించు..!

- గోడ అంచుకు చేరిన గాంధీ విగ్రహం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం గోడ అంచుకు చేరింది. మండలకేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి ఏర్పాటు పనుల్లో భాగంగా మహాత్మాగాంధీ విగ్రహాన్ని తొలగించి ఓ భవనం గోడ పక్కన నిలబెట్టారు. నెలరోజులకుపైగా గాంధీజీ విగ్రహం అక్కడే ఉంది. అక్టోబర్ 2న మాత్రమే విగ్రహానికి పూలమాలలు వేసే పాలకులు, అధికారులు నెలరోజులకుపైగా మహాత్ముడి విగ్రహం గోడపంచన చేరినా పట్టించుకోవడంలేదు. గాంధీజీ విగ్రహాన్ని మండల కేంద్రంలోని ఏదైనా ప్రభుత్వ కార్యాలయ ఆవరణకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.